# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-03-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలోని దివ్యాంగులకు ఎపిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**2.** **మత్స్య కారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపిన రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

**3.** **ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్-2026)కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 24వ తేదీ వరకూ పొడిగించినట్లు తెలిపిన సెట్ కన్వీనర్ ఎన్.మోహనరావు**

**4.** **విజయవాడలో రాష్ట్రస్థాయి -సురక్ష సంకల్ప కార్యశాల-ను ఈరోజు నిర్వహించిన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (NACO)**

**5.** **రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు ఈరోజుతో ముగిసింది.**

=========================

రాష్ట్రంలోని దివ్యాంగులకు ఎపిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రభుత్వం ఈ రోజు నుంచి ప్రారంభించింది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ ఉదయం ప్రారంభించారు. అనంతరం ఆయన మంగళగిరి బస్టాండ్ నుంచి ఉండవల్లి వరకు దివ్యాంగులతో కలిసి ప్రయాణించారు. ఈ పథకంలో భాగంగా దివ్యాంగులకు 'స్త్రీ శక్తి' పథకం వర్తించే బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగుల అందరికీ ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించింది. దివ్యాంగులతో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లో ఈ పథకాన్ని ప్రారంభించారు.

-------------------------

మత్స్య కారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు, మత్స్యకార సంఘాల నాయకులతో నిన్న సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రైవేటు పెట్టుబడుల

ఏర్పాటుతో స్థానికంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలియజేస్తూ..

వాయిస్ 30 సెకన్స్

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్–2026)కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 24వ తేదీ వరకూ పొడిగించినట్లు సెట్ కన్వీనర్ ఎన్.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదట ప్రకటించిన గడువు నిన్నటితో ముగియడంతో ఈ మార్పు చేసినట్లు వెల్లడించారు. 1000 రూపాయల ఆలస్య రుసుముతో ఈ నెల 28వ తేదీ వరకు, 2 వేల రూపాయలతో ఏప్రిల్ 1వ తేదీ వరకు, 4 వేల రూపాయలతో ఏప్రిల్ 6వ తేదీ వరకు, 10 వేల రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 10వ తేదీ వరకూ గడువు పెంచినట్లు వివరించారు. దరఖస్తుల్లో తప్పుల సవరణకు ఏప్రిల్ 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ అవకాశం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లోని మార్గదర్శకాలను జాగ్రత్తగా పరిశీలించి, దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

---------------------------

ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 'యువ సంగమ్' కార్యక్రమం 6వ దశలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు గడువు ఈ రోజుతో ముగియనుంది. యువ సంగమ్ లో పాల్గొనాలనుకునే విద్యార్థులు ebsb.aicte-india.org వెబ్‌సైట్ ద్వారా ఈ రోజు రాత్రి 11.55 ని,, వరకు నమోదు చేసుకోవచ్చని కేంద్ర విధ్యాశాఖ సూచించింది. ఈ కార్యక్రమం ద్వారా యువతకు దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సాంస్కృతిక సంప్రదాయాలు, వారసత్వం వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది.

---------------------------

స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌కి కారణమై న వైరాస్ నివారణకు హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. గత రెండు వారాల్లోనే.. మూడు లక్షల మంది 14 ఏళ్లలోపు బాలికలకు టీకాలు వేసినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, ఒడిశా మిజోరం రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్షల కాలం ముగిస్తే ఈ డ్రైవ్ మరింత చురుగ్గా పని చేసే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

---------------------------

హెచ్‌ఐవీ నివారణ చర్యలలో భాగంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (చీూజూ) విజయవాడలో రాష్ట్రస్థాయి –సురక్ష సంకల్ప కార్యశాల–ను ఈరోజు నిర్వహించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ హెచ్‌ఐవీ నివారణ చర్యలను బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ వర్క్ షాప్ లో 26 జిల్లాల నుంచి కార్యక్రమ బృందాలు పాల్గొని తమ పురోగతిని, సవాళ్లను వివరించాయి. క్షేత్రస్థాయిలో హెచ్‌ఐవీ నివారణ ప్రచారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాయి. ఈ సందర్భంగా (NACO) అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ రాకేష్ గుప్తా మాట్లాడుతూ..

వాయిస్ 30 సెకన్స్

---

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల గడువు నిన్నటితో ముగిసింది. దీంతో ఈ రోజు నుంచి రాష్ట్రంలోని 75 మున్సిపాలిటీలు, 11 మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. కాగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం గడువు జూలై 29తో ముగియనుండగా, నవంబర్ 21న మరో 13 పురపాలకాల్లో పాలకవర్గాల గడువు ముగియనుంది. అలాగే, ఏప్రిల్ 2 నుంచి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో కూడా ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది.

---

నంద్యాల జిల్లా శ్రీశైలం మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. ఉత్సవాల రెండవ రోజు లో భాగంగా మహా దుర్గ అలంకార రూపంలో శ్రీ భ్రమరాంబికా దేవి భక్తులకు నిన్న దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై మహా దుర్గ అలంకార రూపంలో ఆశీనులైన అమ్మవారికి కైలాస స్వామివారికి అర్చకులు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో భాగంగా ఈ రోజు అమ్మవారు మహా సరస్వతి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. ఈరోజు సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు ఆలయ ప్రధాన పురవీధిలో స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం, రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తులకు నందివాహన సేవ జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

---

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు పురస్కారాలను ప్రకటించింది. ఇందులో భాగంగా మొత్తం 164 మందిని పురస్కారాలకు ఎంపిక చేసింది. ప్రతిష్టాత్మకమైన 'కళారత్న' అవార్డులకు 40 మందిని ఎంపిక చేయగా, 'ఉగాది విశిష్ట పురస్కారాల'కు వివిధ రంగాలకు చెందిన మరో 124 మందిని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రేపు విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

---

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ రోజు విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ముస్లిం సోదరులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ నాయకులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణలో పాల్గొంటారని చెప్పారు.

=====================